## కథ

# రెడీమేడ్ స్కూల్

షేక్ అల్లాబక్షు

**ఆకాష్ ఇంటికి వచ్చేసరికి వాతావరణం గందరగోళంగా ఉంది. చుట్టుపక్కల మహిళలు, రిటైరై ఇంట్లో ఉన్న పురుషులు, ఆకాష్ భార్య సౌదామినిని ఓదారుస్తున్నారు. ఆఫీసులో ఉండగా అర్జంటుగా బయలుదేరి రమ్మని ఎవరో ఫోన్ చేయడంతో హుటాహుటిన బయలుదేరి వచ్చాడు. ఫోన్ చేసిన వ్యక్తిని ఎన్ని సార్లు రెట్టించినా అసలు విషయం ఏమిటో చెప్పలేదు సరికదా, "గుండె రాయి చేసుకోవాలి. ఇలాంటప్పుడే ధైర్యంగా ఉండాలి" అని హితబోధ చేయడంతో నిజంగానే ధైర్యం కోల్పోయాడు.**

స్కూటర్ స్టాండ్ వేసి గబగబా లోపలికి నడిచాడు. అక్కడ మూగిన వ్యక్తులంతా ఆకాష్ కేసి జాలిగా చూస్తుండడంతో అసలు ఏం జరిగిందో అర్థంకాని పరిస్థితి.

ఇంట్లో ఓ మూల శోకదేవతలా ఉన్న భార్య నడిగాడు.

''సౌదా ఏం జరిగింది?'' ఒక్కసారిగా సౌదామిని బావురుమంది. ఈ అవకాశం కోసమే మేమున్నామంటూ ఉన్న ఆడవాళ్ళు ఓదార్పులు, సపర్యలు మొదలుపెట్టారు.

''ఊరుకోమ్మా! ఏం జరిగినా మన మంచికే అనుకోవాలి'' అని ఒకరు, ''కష్టాలు మనుషులకు కాక మానులకు వస్తాయా?'' అంటూ మరొకరు ఓదార్చే ప్రయత్నం చేయటంతో సౌదామిని ఏడుపు తారాస్థాయికి చేరుకుంది.

ఆకాష్‌కి ఇక్కడి వాతావరణం చూస్తుంటే చిర్రెత్తుకొస్తోంది. బంధువులెవరన్నా పోయారా? అభిమాన నటి చనిపోయిందా? కేబుల్ టి.వి. వాడు కనెక్షన్ కట్ చేశాడా? మనసు పరి పరి విధాల పోతోంది.

ఇల్లంతా ఇరుగు పొరుగు వారితో నిండిపోయింది. తాను నిలబడటానికి కూడా జాగా లేదు. ఇరుగు పొరుగు పిల్లలు ఇంట్లో సామానంతా చిందర వందర చేసేశారు.

ఆకాష్‌లో ఉండేకొద్దీ టెన్షన్ ఎక్కువవుతోంది. జుట్టు పీక్కుందామనుకుని, బట్టతల కావడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. అతని టెన్షన్ గమనించిన ఓ పెద్దాయన ''బాబూ! ఇటు కూర్చో, ముందు కాఫీ తాగు'' అంటూ కాఫీ కప్పు అందించాడు.

ఆ వ్యక్తిని ఇంతకుముందు కాలనీలో ఎక్కడా చూసిన దాఖలా లేదు. అప్పుడు గమనించాడు ఆకాష్ తన ఇంటి నిండా తాగి పడేసిన కాఫీ కప్పులు, ఎవరో ఒకావిడ రెండో, మూడో రౌండ్లు కాఫీ అందిస్తూనే ఉంది. ఆకాష్ కాఫీ తాగేలోపే అసలు విషయం బయటపెట్టాడు ఆ పెద్దాయన. ''మీ బాబునెవరో కిడ్నాప్ చేశారట.''

చిరాగ్గా ఉంది. ఏమి ఆశించి తన బాబును కిడ్నాప్ చేశారు. ఆలోచనలతో బుర్రంతా వేడెక్కిపోతోంది. చుట్టూ చేరినవారి వ్యాఖ్యానాలు మరింత చిరాకును పెంచేస్తున్నాయి.

అసలిదంతా ఎలా జరిగింది? గొంతు పెగల్చుకొని అడిగాడు. స్వాతి టి.వి. యాంకర్‌లా బయటకు వచ్చింది. తాను విన్న ప్రత్యక్ష, పరోక్ష సారాంశాన్ని అందించింది. సౌదామిని తన బాబుకి స్నానం చేయించిన తర్వాత ఆడుకుంటూ మొండి మొలతో బయటకు వచ్చిన బాబును వేగంగా వచ్చిన ఒక వ్యాన్‌లోని వ్యక్తులు కిడ్నాప్ చేశారని ఆమె వివరించింది.

మళ్ళీ ఆకాషే ప్రశ్నించాడు ''ఇదంతా ఎవరు చూశారు?'' అన్నాడు పొడిగా.

పక్కలో బాంబు పడ్డట్లు ఉలిక్కిపడ్డాడు. తాగుతున్న కాఫీ పొలమారింది. మూడు సంవత్సరాలు నిండా నిండని తన బాబును ఎవరు కిడ్నాప్ చేసుంటారు. అంత అవసరం ఎవరికి వచ్చింది. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఆలోచించడానికి కూడా అవకాశం ఇవ్వలేదు అక్కడ చేరిన పెద్దలు.

''ఈమధ్య ఊర్లో పిల్లల్ని ఎత్తుకొనిపోయే వారు ఎక్కువయ్యారు. ఇలా ఎత్తుకెళ్ళిన పిల్లల్ని విదేశాలకు అమ్ముతుంటారు. లేదా కాలో, చేయో తీసి యాచకులుగా తయారుచేస్తుంటారు'' అంటూ తను కనుగొన్న వాస్తవాన్ని నింపాదిగా చెప్పాడు రిటైర్డ్ టీచర్ గురుమూర్తి.

వెంటనే అందుకుంది పక్కింటి యశోద. ''ఊరుకోండి మామగారూ! మీరు చెప్పిన సంగతులన్నీ పదేళ్ళ క్రితం సంగతులు. ఈమధ్య వీళ్లు కొత్త పద్ధతులు కనిపెట్టారు. పిల్లల్ని చంపి, వాళ్ళ కళ్ళు, లివరు, అన్ని శరీర భాగాలు అమ్మేస్తూ ఉంటారు'' తనకున్న పరిజ్ఞానాన్ని ప్రదర్శించింది.

సౌదామిని ఏడుపు స్థాయి పెరిగింది. బిక్కచచ్చిపోయాడు ఆకాష్.

బందిపోట్లు కిడ్నాప్ చేశారని ఒకరు, లేదు నక్సలైట్లే కిడ్నాప్ చేసుకుంటారు మరొకరు, కాదు ఐ.ఎస్.ఐ. తీవ్రవాదులు కిడ్నాప్ చేసుంటారని ఇంకొకరు ఇలా రకరకాలుగా మాట్లాడుతున్నారు.

విశ్వనాథం మాస్టారింట్లో పనిమనిషి రత్తాలు చూసిందని చెప్పింది స్వాతి. రత్తాలు అనే శాల్తీ గుంపులో నుంచి బయటకు వచ్చింది. ''అయ్యారు! నేను చూడలేదండీ! మూల బడ్డీకొట్టు శంకర్ చూశాడంట''

అందరి చూపులూ శంకర్ అనే కళ్ళజోడు వ్యక్తి వైపు మళ్ళాయి.

''అవును నేనే చూశాను'' ధీమాగా అన్నాడు శంకర్.

''ఎదురుగా ఉన్న వ్యక్తి ఆకారమే సరిగా చూడలేని వాడివి, ఆ మూలనుండి ఈ ఇంట్లో జరిగిన సంఘటనెలా చూశావ్?'' ఎవరో హేళనగా ప్రశ్నించారు.

''ఇదంతా కాదుగానీ కాలనీలో బాబు ఎవరి ఇంటికైనా వెళ్ళాడేమో కనుక్కుందాం'' అంటూ ఇద్దరు స్టూడెంట్స్ ఆకాష్ స్కూటర్ తీసుకుని ఊరంతా తిరిగి బాబు ఎక్కడా కనబడలేదని చెప్పారు.

''బాబూ! ఏమనుకోకు బ్యాంకు బ్యాలెన్స్ గానీ, ఇంట్లో వేరే డబ్బులుగానీ ఉన్నాయా?'' అంటూ ప్రశ్నించింది ఎదురింటి బామ్మగారు.

'తమ గొడవలో తాముంటే ఈ డబ్బుల గొడవ ఏమిటి? ఈమేమన్నా ఇన్‌కంటాక్స్ ఆఫీసరా' అనుకున్నాడు ఆకాష్.

అదే విషయాన్ని ఈ సంభాషణ వింటున్న గురువమూర్తి ''బామ్మగారూ! ఈ సమయంలో డబ్బుల గొడవెందుకు? డబ్బుల్లేవు, వారిదగ్గర లేవంటే మీరిస్తారా? జరగవలసిందేమిటో ఆలోచించాలిగాని'' అంటూ తన అసహనాన్ని వెలిబుచ్చాడు.



గయ్యిన లేచింది బామ్మగారు. అంతకు ముందు వారి కుటుంబాల మధ్య ఉన్న కలహాల నేపథ్యం కూడా ఉండటంతో ఆకాష్ ఇల్లు వేదిక అయ్యింది. ''భలే చెప్పావులే వయ్యా గురుమూర్తీ! కిడ్నాప్ చేసినవారు అడిగితే డబ్బులు ఎలా అని ఆలోచించాలి. ముందు జాగ్రత్త ఉండక్కర్లేదా? ముసలిదాన్ని నేనేమి డబ్బులిస్తాను. 10 రూపాయలకు, 15 రూపాయలకు లక్షలకు లక్షలు వడ్డీలు అప్పులిస్తున్న నువ్వే సాయం చెయ్యి''

మాట మాట పెరిగింది. అటు కొందరు, ఇటు కొందరు చేరి కొంతసేపు వివాదాన్ని వినోదంగా వాడుకొని చివరకు వారే సర్ది చెప్పారు.

చుట్టూ చేరినవారు ''బాబుకుగానీ, మీకు గానీ ఎవరన్నా శత్రువులున్నారా?'' అంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు. పోలీసు రిపోర్టు ఇద్దామని కొందరు, వద్దని కొందరు వాదనలు జరిగిపోతున్నాయి.


అంతా అయోమయంగా ఉంది.

సమయం మధ్యాహ్నం 2 గంటలైంది.

అక్కడినుండి ఎవరూ కదిలేట్లు లేరు. ఎవరో ఇద్దరు ఆడవాళ్ళు చొరవగా వంటింట్లోకి జొరబడి అందరికీ ఆకాష్‌తో సహా ఫలహారాలు అందించారు. ఎవరి గోల వారిది. ఈ గొడవలో ఇంట్లోని 10 రోజుల రేషన్ అయిపోయి ఉంటుందనిపించింది ఆకాష్‌కు.

''కిడ్నాప్ చేసినవారు డబ్బులు డిమాండ్ చేయడానికే, మీ ఇంట్లో ఫోన్ ఏమైనా ఉందా?'' తనుకున్న సినిమా పరిజ్ఞానాన్ని ప్రదర్శించింది ఓ ఆవిడ.

అంతటి విషాదంలో సౌదామిని ''ఎన్నోసార్లు చెప్పాను. మన ఇంటికి ఫోన్ కనెక్షన్ ఇప్పించమని, చెబితే వింటేగా. పుట్టింటివారితో సినిమా కబుర్లు, టి.వి. సీరియల్స్ చర్చిస్తామని హేళన చేశారు. కిడ్నాపర్లు ఎలా ఫోన్ చేస్తారో'' అంటూ దీర్ఘాలు తీసింది. అక్కడ







ఉన్న ఆడవారందరూ ఆకాష్‌కేసి దోషిని చూసినట్లు చూశారు.

ఇంట్లో పాలు, ఫ్రిజ్‌లో కూల్‌డ్రింక్సు, పండ్లు, అన్నీ అయిపోయాక సాయంత్రం 4 గంటలకు ఒక్కొక్కరే చిన్నగా జారుకున్నారు.

ఈ సమస్య పరిష్కారం ఏమని ఆలోచిస్తుండగా, ఇంటిముందు వ్యాన్ ఆగింది. అందులో నుండి వైట్ షర్ట్, నిక్కర్, మెడలో టై, కాళ్ళకు షూ, మూర్ఛరోగికి వేలాడదీసే విధంగా ఒక చిన్న ఐ.డి. కార్డుతో ''హాయ్ డాడ్! హాయ్ మమ్!'' అంటూ బాబు ఇంట్లోకి ప్రవేశించాడు. ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టాడు ఆకాష్. ఆనందంతో మురిసిపోయింది సౌదామిని.

''ఏమండీ మన బాబు అచ్చం చిన్న కలెక్టర్‌లా ఉన్నాడండీ'' ఆనందంతో బాబును హృదయానికి హత్తుకుంది. ఉదయం మొండి మొలతో వెళ్ళిన బాబు ఈ గెటప్‌లో ప్రత్యక్షమవ్వడం, ఏం జరిగిందో అర్థం కావట్లేదు ఆకాష్‌కు. ఆశ్చర్యం నుండి తేరుకుని అడిగాడు.

''ఏరా ఇప్పటిదాకా ఎక్కడికెళ్ళావ్?''

అప్పుడే స్కూల్ బ్యాగ్‌తో ప్రత్యక్షమయ్యారు ఇద్దరు వ్యక్తులు. వారిని చూస్తూనే కోపం ఒక్కసారిగా నషాళానికి అంటింది. ''ఏయ్! మా బాబును ఎందుకు కిడ్నాప్ చేశారు? ఇప్పుడే పోలీస్ రిపోర్టు ఇస్తాను'' అంటూ వారిమీదకు దూకాడు. వచ్చినవారు అదిరిపడి ఒకడుగు వెనక్కు వేశారు.

''సారీ సార్, మేము రెడీమేడ్ స్కూల్ స్టాఫ్‌ము. మేము మీ అబ్బాయికి మా స్కూల్‌లో అడ్మిషన్ ఇచ్చాము. డి.ఎస్.పి. భార్య ఈ స్కూల్‌కు డైరెక్టర్. ఫీజు వివరాలు బ్యాగ్‌లో ఉన్నాయి. రేపు ఫీజు పే చేయండి'' అంటూ మరో మాట మాట్లాడానికి అవకాశం ఇవ్వకుండా అక్కడి నుండి నిష్క్రమించారు.

సౌదామిని స్కూల్ డ్రస్‌లో బుల్లి కలెక్టర్‌లా ఉన్న కొడుకును చూసి మురిసిపోతోంది. ఆకాష్ స్కూల్ బ్యాగ్‌లో ఉన్న స్కూల్ ఫీజు చూసి అవాక్కయ్యాడు.

రెండు నెలలు గడిచాయి. స్కూల్ ఫీజు కట్టడానికి ఉన్న స్కూటర్ అమ్మివేసి మరింత అప్పు చేశాడు ఆకాష్. బాబు రోజూ వ్యాన్‌లో స్కూల్‌కి వెళ్ళి వస్తున్నప్పుడు చూసి మురిసిపోతోంది సౌదామిని. ఓరోజు హడావుడిగా ఆటోలో దిగిన ఆకాష్ సౌదామినితో ''సౌదా కాలనీలో ఏమిటి గొడవ. బాంబులు కూడా వేసుకుంటున్నారు'' అంటూ ప్రశ్నించాడు. సౌదామిని ప్రశాంతంగా మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ అంది. ''కొత్తగా కాలనీలోకి దిగిన పంకజానికి మూడవ నెల...''

ఆమె మాట పూర్తి కాకుండానే చిరాగ్గా అన్నాడు ఆకాష్. ''నేను మాట్లాడుతున్నదేమిటి? నువ్వు మాట్లాడేదేమిటి?''

''అదే చెప్పబోతున్నాను. మంత్రిగారి వియ్యంకుడు కొత్తగా స్కూల్ తెరిచాడు. పంకజం కడుపులో ఉన్న బిడ్డకోసం రెండు స్కూళ్ళ వాళ్ళు పోటీపడుతున్నారు, అదీ సంగతి.''

## బయ్యర్‌గా కల్యాణి

**దర్శకుడు సూర్యకిరణ్‌ని పెళ్లాడిన హీరోయిన్ కల్యాణి ఇప్పుడు సినీ బయ్యర్‌గా మారింది. తన భర్త సూర్యకిరణ్ దర్శకత్వంలో జగపతి బాబు నటించిన 'బ్రహ్మాస్త్రం' సినిమా చెన్నయ్ ఏరియా ప్రదర్శన హక్కుల్ని 'మిడాస్ టచ్' అనే సంస్థ పేరిట కొనుగోలు చేసి విడుదల చేసిందిట. పెళ్లి తర్వాత ఆల్మోస్ట్ సినిమాలకి గుడ్‌బై చెప్పేసిన కల్యాణి- భవిష్యత్తులో మంచి ఫిలిం డిస్ట్రిబ్యూటర్‌గా రాణిస్తుందేమో!**

